షికారు

విద్వాన్ సూరిగుచ్చి కృష్ణమూర్తిగారు

"ఏమండీ మతిషికారు తీసికెళ్ళితే నలుగురూ నవ్వుతారంటారుగదా ఆశాస్త్రుల్లుగారు రోజూ పెళ్లాంతోనే వెడతారే? నవ్వరేంఎవ్వరూను?"

"ఆయనకు కారుఉందిగనక వెడతారు"

"బాగుంది కారుకీ షికారుకీ సంబంధమేమిటి?"

"ఎవరన్నానవ్వితే డ్రైవరు దబదబాపోనిస్తాడు. అందుకోసం ఎవరునవ్వేది తెలియదన్నమాట"

"ఇది మరీబాగుందిలెండి, ఎవరన్నానవ్వేప్పుడే అతడు తొందరగాతోలుతాడాయేమిటి? అయినా ఆవిడసాయంత్రం ఎప్పుడో పొద్దుకూకేప్పుడు మొగుడుతో వెడుతుందిగదా మతిపూలేమో పొద్దున్నే విచ్చుతాయాయెను, అయితే ఆవిడపెట్టుకున్నపూలు అచ్చు అప్పుడేవిచ్చినవాటిమోస్తరుగా ఉంటాయే- కాస్తేనా నలిగేనాఉండవే మతి?"

"ఆవిడ జాగ్రత్తపడుతుంది. పొద్దున్నేకోసి నలక్కుండాదాచి షికారుకోసమని అట్టే బెట్టుకుంటుంది."

"ఎంతభద్రంగాఉంచుకున్నా కాస్తేనా వాడైనా ఉండవాయేమిటి మతీను"

"అయితే అవి గుడ్డపూలు. బజార్లో అల్లాంటివి అమ్ముతారు"

"మతి వాసన ఏలావస్తుంది?"

"ఏంవాసనలేకపోతే యేం ఆవిడకు"

"ఆవిడకేమిటి, మొన్న నేను చూస్తేనే. ఎంత మంచివాసన వేశాయనుకున్నారు?"

"ఏశెంటో రాసిఉంటుంది ఆగుడ్డపూలకే"

"సెంటువాసనా గులాబీపూలవాసనా అంతతెలియదనుకున్నారాయేం?"

"గులాబీసెంటని ఓటిఉంటుందిలే అది అచ్చు వాసనే-మతిపాపం నీవు పల్లెటూరిదానివి. నీకేంతెలుస్తుంది.?"

"మహాబస్తీవారు ఎల్లాగైతేనేం పాపం- పోనీ పల్లెటూరని ఆక్షేపించకపోతే బస్తీగొప్పలు చూపించరాదూ"

"ఉండూమతి, మొన్న నేగావస్తివి అప్పుడే మొగుడూపెళ్ళాం కారులో షికారుకుపోవడం చూశావుగా"

"సరేగాని నేనూ షికారుకు పోవాలనిఉందండి, ఒక్కమాటు తీసుకెళ్ళుదురూ"

"నాతోనే షికారుకు- అదోఊరనుకున్నావా?"

"మహాగొప్ప, ఏమీ యెరగననుకున్నారు గాబోలు పోనీలెండి ఏదోటిగాని ఓమాటు తీసుకెళ్ళుదురూ."

"మతినువ్వు ఆడదానివిగదా నీకు సిగ్గుండదూ నాతో వచ్చేందుకు?"

"సిగ్గేమిటి ఇదేంపల్లెటూరా ఏమన్నానా?. బస్తీలో సిగ్గులూ బిడియాలూ ఉండగూడదంటారుగా"

"నాకు సిగ్గుగాఉంటుంది, నేరాను"

"పోనీలెండి. ఏదోటి తీసికెళ్ళగుండా ఉండేందుకు"

"అల్లాఅలిగితేగాదు మతి. నీకు తెలియనన్నా తెలియాలి నేచెపితే విననన్నా వినాలి. రెండులేకుంటే ఎలా అల్లాఅయితే తీసుకెడతాలే. ఎవరోరు సర్దుకోకపోతే మతి సంసారంలో ఉన్న ఇద్దరమూ చెరోదిక్కూ-అయితే నవ్వులపాలేగా- మాకుసెలవున్నరోజు వెళ్దాంలే-"

ఈఊళ్ళో మూడేళ్ళనుంచీ మేష్టరీచేస్తున్నా హోటల్లో తింటూండమేగాని సంసారంఅనేదిలేదు. ఈయేడే కొత్తకాపరం. అసలు ఆమ్మాయి పచ్చిపల్లెటూరిది. ఎలాఉంటుందో ఆలోచించండి. నాజూకూ అవీఅలాఉంచండి. ఓ తెలివితేటల్లోనైనా పూర్ణానుస్వారమే- అయితే మహాగడుసుదానిలాగ ప్రశ్నలు వేస్తుంది. పాపం పల్లెటూరిపిల్లగదాఅని ఏమైనా చూపించి నాగరికత నేర్పుదామనుకుంటే వింటేనా?

ఓనాడు మాఊళ్ళోరాజుగారి ఏనుగు అలా మా గుమ్మంలోంచేవెడుతూంటే ఏనుగంటే ఏమిటో పాపం చూపిద్దామని నేను తొందరగావచ్చి అది గోసేవేనుగు అనిచెప్పితే పోనీలెండి అని మెల్లిగా అంది- ఇంతనాఆదుర్దాకూ కత్తిపీటమీదనుంచి తరిగే వంకాయనన్నా ఆపలేదు- పోనీ ఏనుగంటే ఏచీపురు కట్టో అనుకుందిగాబోలు వెత్తిబాగులది అనుకుని దానినివర్ణించి ఎంతోవింతగా నాకవిత్వమంతా ఉపయోగించిచెప్పితే ఓచలనమన్నాలేకండా "అయితే ఆరాజుగారు అంతఏనుగనీ ఊరికేవదలిపెట్టకపోతే ఓపెద్దబండీచేయించి దాంలో వెడుతూండరాదు రోజూనూ?" అని ప్రశ్నలుప్రారంభించింది- ఇంకా పైగా ఆయన్ని ఒంటిగుఱ్ఱం లాగలేదనో మరి దర్జాకో రెండుగుఱ్ఱాలబండీమీద వెడతాడులెండి- అవి ముసిలివిట- మహాయిది గుఱ్ఱాలమొఖం చూసినట్టేప్రశ్నలు- ఇదొక్కటేగాదుసుమండి. రోజూఅన్నిటికీయింతే. మొన్నటికి మొన్న పుష్పకరాలక్కాబోలు విమానం ఓటి మాయింటిమీదనుంచే పైగా పేద్దమోతతో అందరూ హడిలిపొయ్యేట్టుపోతూంటే ఊళ్ళోయింటిల్లిపాదీ చిన్నాపెద్దా ఆడామొగలేకండా వచ్చారు తనపాటితను కంచంకడుగుతూంది గుమ్మందగ్గిరకేనా రాలేదు- మాయింటిపక్కన ఓబూబూలయిల్లుంది- వాళ్లకి గోషాగా. అయినా ఆబూబూ పాపం ఆవిమానదర్శనోత్సాహంలో గోషాగీషా మరిచి పులుసు కలేబెడుతున్నదిగాబోలు ఆ తెడ్డుతోనే పాపం బయటికొచ్చి పైననోరుతెరిచి చూచిచూచి అదికనబడకండా వెళ్ళాకే యింట్లోకివెళ్ళింది- అంతఆదుర్దాయింతమందికీఉంటే తను బైటికన్నారాదే. చెముడనుకుంటారేమో. పాము చెవులుసుమండీమళ్ళీను. ఇల్లాఉంటే ఏమిటిఇంకా బస్తీసంగతులుచూపడం- ఇల్లాంటిమనిషి ఉంటుందనుకుంటామా?

సినిమాఅంటే ఏమిటో ఎరగదుగా అని పోనీ ఓరోజుచూపిద్దామని "రేపుసినిమాకు పోదామా?" అన్నా.

"అంటే"

"అక్కడ బొమ్మలూ అవీచూపుతారు. బాగా ఉంటుందిలే-"

"బొమ్మలాటావద్దు గురుగులాటావద్దు నేను నిద్ర ఆపుకోలేను. మాఊళ్ళోకూడా మా అమ్మా వాళ్లే వెళ్లేవాళ్ళుగాని ఒక్కనాడన్నా నేవెళ్ళలేదు-"

పాపం పల్లెటూళ్ళల్లో తోలుబొమ్మల్లాంటివిదనుకున్నది-ఆనిశ్చితాన్నిపోగొట్టి- కాదని ఒప్పించేందుకు తాతలేదిగిరావాలి- అసలు సినిమా నాకూబాగుండదు- ఏదోదాంలో నాకోస్నేహితుడుఉన్నాడు, డబ్బు లేకుండావెళ్ళొచ్చుగా. ఏంతోచకపోతే సినిమాకు పోవడం మామూలు ఇదివరకు- సరిగ్గా ఆనాడే ఆస్నేహితుడు ఇంటికిరావడం,ఆయన మమ్మల్నిద్దరినీ ఆహ్వానించేడు ఆరోజు కొత్తఆట మంచిదీఅని- లేకపోతే అసలు ఈప్రసక్తేఉండేదికాదు- నాకింకో భయం తీరామాచి ఆనందిస్తుందేమో అని తీసికెళ్ళి ఆస్త్రీలకు ప్రత్యేకస్థలంలో దీన్నికూడా కూచోబెడతాననుకోండి- ఈఊళ్ళోసినిమాలో ఎప్పుడూ యుద్ధాలే చూపిస్తారు అదోఅలవాటు ఈ ఊరు సినిమాకు వాళ్ళూవాళ్ళూ ఆగుడ్డతెరమీద కత్తులుతిప్పి పొడుచుకుంటూంటే తనమీదికెక్కడవస్తారో అని బిగ్గిరిగా అరుస్తుందేమో అల్లరిపాలు అనినాభయం-

ఆసినిమామిత్రుడు వెళ్లాకే నేను సినిమాప్రస్తావన తెచ్చాను. తను రానంటే రానంది ఆబొమ్మలాటకి

"అయితే ఆయనెవరండీ"అని అడిగింది.

"ఈఊరే. ఓపెద్దమనిషి"

"అంటేఆయనా మేష్టరేనా?"

అసలుఆయనకేం ఉద్యోగంలేదు లేదనిచెప్పితే ఊరికే ఎందుకున్నాడు అదీఇదీ ఓలక్షప్రశ్నలు. కొద్దిలోముగిద్దామనుకొని ఆయన సినిమాలో ఉంటారన్నాను

"అయితే రోజూబొమ్మలని ఆయనేఆడిస్తూంటూరా?"

వేగలేకదాంతో అవునన్నాను.

"ఉహూఁ ఇంకేంబొమ్మలాళ్లూ చెంచులాళ్లూనా మీసావాసం" అని యీసడించింది దీనిమాటల్లో తెఖ్ఖాఅనుకుని ఊరుకున్నాను. అయితే "ఇల్లాఅల్లా

అనగూడదు. ఆయనగొప్ప జమీందార్''ని మాత్రం చెప్పాను ఏంలాభం? తనుఓటి అనుకుంటే అదిశిలాక్షరం. దాన్నితుడువాలంటే ఓప్రళయం.

ఇంతకూ సినిమాఅంటే తోలుబొమ్మలాట అనే నిశ్చయంతో రానంటూన్నదని యేదో గమ్మత్తుచేసి ఒప్పించి ఓరోజు తీసికెళ్ళాను

ఆ సినిమాలో హార్మోనియం వాయించేవాడు ఎప్పుడేనాపాడుతూంటాడు ఆ పాటకందరూ నవ్వుతూనే ఉంటారు అయితేనేం ఆహార్మోనీయం మోతలోనూ అతడిపెద్దగొంతులోనూ సభ్యులనవ్వు లీనమైపోతూంది మేము సినిమాకువెళ్ళినరోజున అతడు చాలాసార్లు పాడాలసివచ్చింది దాంతో ఇక తప్పకుండా తోలుబొమ్మలాటే అని నిశ్చయంచేసుకుంది. ఇంటికిరాగానే "సినీమా, సినీమా"అని దబాయిస్తారేం వెధవతోలుబొమ్మలాటచూపి హాయిగా నిద్రోయేదాన్ని. ఇకను చస్తే మీమాటలు నమ్మను బాబూ" అని అంది దీనిమాటలకేం పాపం పల్లెటిదిక్కు అమాయకురాలని అనుకుని ఊరుకున్నాను

ఇంతకూషికారుకు పోదామని పట్టుపట్టింది. అది ఏమిటో అనుకుంటుంది అక్కడ చాలామంది పేరంటానికి వచ్చినట్లుగా ఉంటుందనుకున్నదిగాని ఇల్లూ పనీపాటాలేనివాళ్ళు ఇంతకాఫీతాగి ఏపంపులచెరువు గట్టునో కూనురాగాలు తీసుకుంటూ కూచోడమని తెలిస్తే నాతోవస్తానంటుందా, తనేనాపోతానంటుందా? పాపం ప్రశ్నలు ఏదోగొడవగా వెయ్యడమేగాని నిజానికి అమాయకురాలు అసలు ఈఅమాయికంగడునుతనమేమో అనుకున్నాను మొదట. పరీక్షిద్దామని ఓరోజునాకన్నం పెట్టాకనుంచుంది నీవూ పెట్టుకోఅన్నాను. పెట్టుకున్నది నాతోపాటు తింటున్నది అయినాచూద్దామని "నాపళ్ళెం నేనే కడుక్కుంటాను, నీకంచంనీవుకడుక్కో''అన్నాను సరే లెండిఅన్నది. నేముందుతినివచ్చాను తనుతిని తనకంచం కడుక్కునివచ్చింది. నాదెందుకు కడగలేదంటే మీదిమీరే కడుక్కుంటానన్నారుగా పోనీ నన్నేకడగమంటే కడుగుతానంది చూశారా నేకడగమనాలిట. పోనీ నేనేదో అలాఅంటే ఏదోమొగవాణ్ణిగా తిన్నపళ్ళేంకూడా ఎల్లాకడుక్కోను ఇంట్లో ధర్మదాసిఉంటూంటే? తనుమర్యాదాకైనా నేనే కడుగుతాలెండి అని అనదేంఅనుకున్నాను. పోయి నేనేకడుక్కున్నాను. తనుచూస్తూ పడుకునిఉంది. ఎంతోకోపమొచ్చింది కాని యేంచెయ్యను నేనే తెచ్చిపెట్టుకున్నదాయెను. అదేసమాధానంచెప్పుకుని ఊరుకున్నాను.

ఇదీ అమాయకంవరస ఇల్లాంటిఅమాయకంతో వేగలేకపోతున్నాను రోజూగుమ్మంలోంచే సినీమా బండి పోతూంటుందా ఆమాత్రం తెలుసుకోలేదూ "ఏమండీ యీఊళ్ళో రోజూ పెళ్ళేఅవుతూంటుందే" అని తిరిగ్గా ప్రశ్నవేస్తుంది మాయింటిపక్కన శర్మగారు అదేదోదేశంవెళ్ళి సంగీతం నేర్చుకొచ్చారు ఇదో పెద్దగాధలెండి ఆయనసర్దాగాకొత్తగనక ఎప్పుడూ బిగ్గరగాపాడుతూండడం అలవాటు అది మా వీధిలో ప్రతీవాళ్ళకీతెలుసు. తనూఆపాటె గ్రహించాలా? "అబ్బ పాడు గ్రామఫోను ఎప్పుడూ ఆపిచ్చి ప్లేటే వేస్తారేమిటండి ఏంబాగుందని''అని నన్నడుగుతుంది అది పిచ్చిప్లేటుట సంగీతం ఎలాంటిదో తను నిజంగా ఎరిగేఉండదు ఆవాళ్ళదగ్గరకూడా యిలాగే అంటుందేమో పిచ్చగా ఏమనుకుంటారో అని నా భయం చెప్పుకుంటే నవ్వుతారుగాని నాతలవెంట్రుకలన్నిఉన్నవిరోజూ యిల్లాచేసేపనులు, వేసేప్రశ్నలూను ఎంతోవిసుకు నాకు తను పట్టిందేపట్టు. చెప్పితే సూదిమొనవాసేనా వినదు నాకర్థం గాకుండాఉంది యీకాపరం

ఇంతకూ ఇప్పుడు పట్టుదల తను నాతో షికారుకు పోవాలని అసలు తనకీపదం ఎలాతెలిసింది? ఆశాస్త్రుల్లగారు రోజూభార్యతో కారుమీద మాగుమ్మంలోంచే వెడతారు అదిచూసిందిగాబోలును పక్కింటివాళ్లని అడిగిఉంటుంది వాళ్ళుచెప్పిఉంటారు. తనుపోనీ పూర్తిగానన్నా తెలుసుకోరాదూ? ఏమనుకున్నదంటే షికారుఅనేది ఊరనీ దాంలో ఏదోతమాషా ఉండితీరాలనీ అనుకుంది. లేకపోతే ఈయన రోజూ

నాలుగ్గంటలకే భార్యతోకూడా అంతతొందరగా ఎందుకువెడతారు? అని సందేహం.

నేనిదివరకు ఉండేయిల్లు పసరుకోనేరుదగ్గిర ఆ యింటి ఆమెపేరు సుబ్బమ్మగారు. ఆవిడ "ఏమండీ మీభార్యను తీసుకురండీ"అని ఎంతో ఆప్యాయనంగా రోజూ చెబుతూండేది. అప్పుడు నేచెప్పాను ఆ అమ్మాయి పిచ్చిది. చదువూఅవీరావు ఏమీ తెలీదు అని. దాంతో నేనేమో అబద్ధంచెప్పతున్నానని తప్పకుండా చూడాలనేకోరికను ఎక్కువచేసుకుని రోజూ అడుగుతూండేది. ఎప్పుడేనా ఇదివచ్చాక ఆవిడను పిలుద్దామనుకున్నాను. రేపనీ ఎల్లుండిఅనీ రోజులు నెట్టుతూండగానే తను షికారు తీసుకువెళ్ళమని గోలెడుతుంది ఏమనిదింతో ఆపంపులుచెరువుదాకా సాయంత్రం వెళ్ళను? ఆశాస్త్రుర్లుగారిలాంటి ఉదార బుద్ధి ఉండాలిగా షికారు అనేపదానికి తనుఎల్లాంటి అర్థంతీసుకుందో నేనూ గ్రహించాను. అందుకోసం ఓరోజు శనివారంనాడు పొద్దున్నే సుబ్బమ్మగారింటికివెళ్ళి మేము సాయంత్రంవస్తామండి నాలుగ్గంటలకన్నాను ఆవిడ పాపం ఎంతోసంతోషించి వాళ్ళ శ్రీరామమూర్తితోపాటు నాకూ ఇంతకాఫీయిచ్చి "పదిగంటలకే మీరిద్దరూ భోజనాలకూడారండి. సాయంత్రందాకాఉండి వెళ్ళుదురుగాని"అని బతిమాలుకుంది నాకు ఇష్టంలేదు తను అంతకంటె ఒప్పుకోదు అని చెప్పివచ్చాను. ఇంటికివచ్చి "నాలుగ్గంటలకల్లా షికారుకుపోదము తయారుగాఉండు" అన్నాను నిజమేనా అని కళ్లువిప్పింది "పాపం మళ్లీ వెంటనేరావాలి అక్కడఉండొద్దు"అని చెప్పింది షికారుఅంటే అర్థంతెలిసిందైతే యిలాఅంటుందా? అక్కడఉండడమేమిటి దీనితలకాయఅని నాలో నేనే అనుకున్నాను పాపంరాత్రివంట మూడుగంటల నుంచే మొదలెట్టింది శర్మగారుపంపిన ఆవకాయ చాల్లెండి కూరలేకపోతేమానె అని క్షమాపణకోరింది.

నాలుగువేసింది గడియారం బయలుదేరాము. ఏమీ పెద్ద డాబుచీరెలూ అవీకట్టుకోలా అసలుంటెనా? పోనీకొనమనీ అడగదు సుబ్బమ్మగారిల్లు ఓఅరమైలుఉంది నడిచిపోవడం అందులో ముందు నేనూ వెనకతనూను

సుబ్బమ్మగారు సగౌరవంగా ఎదురువచ్చింది. చేయిపట్టుకు ఇంట్లోకితీసికెళ్ళింది. ఏటో అవీ ఇవీ ఫలహారాలు చేసి ఉంచింది. పొద్దునచెప్పేగా సాయంత్రంవస్తామని ఇద్దరంతిన్నాము. ఆవిడఏవో ప్రశ్నలువేసింది దీన్ని తనేమీమాట్లాడలేదు పాపం రక్షించింది నాలాగే ఆవిడనుకూడా ప్రశ్నలువేయలేదు బతికాను అనుకున్నాను అన్నిటికీ నేనే సమాధానంచెప్పి దానికి కొత్తండీఅన్నాను "అవును పాపంచిన్నపిల్ల"అని ఆవిడానవ్వుతూ అనుకుంది.

బయలుదేరాం మళ్ళీ స్వగృహానికి దోవలోఅంది గదా "ఏమండీ ఆశాస్త్రుర్లుగారు పెళ్ళాంతోరాలేదేం ఇవ్వేళ"అని "వీథిలో మాట్లాడకు నాతో"అని కొంచెంవినుగుతో అన్నాను. తనకోర్కె నెరవేర్చానుగా ఆసంతోషంలో పాపం ఆయన్నువిసిగించకూడదనుకుంది గాబోలు మళ్ళీమాట్లాడలా.

మళ్ళీయింతవరకూ షికారుకుపోదామని అనలేదు. పాపం షికారంటే అదేఅని ఇప్పటికీనమ్మకమే

మాయమ్మ మోము

పి. వి. సుబ్బారావుగారు

అన్నింటికంటె మహాద్భుతంబై చిత్ర
　మైన ప్రకృతిఁగన హర్షమొదవు
తీయనిపండ్లు పానీయంబులనుద్రావు
　నప్పు డత్యధికమా హర్షమొదవు
మకరందమునుఁబోలె మాధుర్యమునుచిమ్ము
　నమలకావ్యముఁ జూడహర్షమొదవు
తనశేముషియు విద్యయును గని తండ్రి'హో
　యని మెచ్చుకొనువేళ హర్షమొదవు
గాని శాంతిరసమున కాకరము మోద
మునకు తావు హృదయవికసనపు నిధియు
నైన మాయమ్మమోమును గానగలుగు
హర్షమున కెద్దిసాటి యీయవనియందు.